తరతరాల దురాచారంపై సమగ్ర కథాత్మక రచన

# జోగిని

వి. శాంతి ప్రబోధ



ప్రజాశక్తి బుక్‌హౌస్

ప్రచురణ సంఖ్య : 901
ప్రచురణ కాలం : అక్టోబరు, 2004

వెల : రు.60/-

టైటిల్ : ప్రభాకర్

*ప్రతులకు*
**ప్రజాశక్తి బుక్‌హౌస్**
1-1-187/1/2, చిక్కడపల్లి
హైదరాబాద్-20. ఫోన్ : 27660013

*బ్రాంచీలు*
హైదరాబాద్, విజయవాడ,
విశాఖపట్నం, తిరుపతి, గుంటూరు
ఖమ్మం, హన్మకొండ, నల్గొండ

*ముద్రణ*
ప్రజాశక్తి డైలీ ప్రింటింగ్ ప్రెస్, హైదరాబాద్

రేపటి శుభోదయానికి ఆహ్వానం పలుకుతూ అప్పుడే వేగుచుక్క పొడిచింది. నల్లచీర సింగారి రేతిరి మాత్రం గాభరా పడిపోతుంది. తన ప్రత్యర్థి తెల్లచీర సింగారి ఎప్పుడొచ్చి తనని తరిమేస్తుందోనని సరిగ్గా... అప్పుడే..

ఊరంతా డప్పుల చప్పుడుతో హోరెత్తుతూ.....

హా... అప్పుడే తెల్లవారిందా అనుకుంటూ చెట్లపై కిచకిచరావాలు చేస్తూ పక్షులు... ఆ డప్పుల చప్పుడులో కలిసిపోయిన కేకలు... అరుపులు... కోలాహలంగా... అంతా గందరగోళంగా....

ఆ చప్పుడుకి మెళుకువ వచ్చింది. ఆరుబయట నిద్రిస్తున్న విద్యకి. కొక్కొరొకో... అనే కోడికూతలూ, పక్షుల కిలకిలా రావాలతో సూర్యోదయం అవబోతోందనుకున్న విద్య ఊహకు భిన్నంగా శబ్దాలు.

ఆ చప్పుడు ఏమిటో, ఎందుకో అర్థం కాలేదు విద్యకి. పక్క మంచంలో పడుకున్న కవిత కేసి చూసింది. హాయిగా నిద్రపోతోంది. ఆమె మధ్యలో తనలో తానే నవ్వుకుంటోంది కాబోలు. పెదవులు విచ్చీ విచ్చనట్లుగా... ఉన్నాయి. బహుశా వాళ్ళ బావ గుర్తొచ్చాడేమో...!

అనుకుని, వద్దులే... ఆమెను లేపొద్దులే అనుకుంటూ శబ్దం వస్తున్న వైపుకు అడుగులు వేసింది విద్య ఆమె వెళ్ళేసరికి మూడొంతుల ఊరు అక్కడికి చేరింది. ఏమైంది? ఆదుర్దాగా ప్రశ్నించింది కనిపించిన వారిని.

“పండగ” జరుపుకుంటున్నాం అన్నారు వాళ్ళు.

పండగ సంబరాలా....? కనీసం తూర్పున సూర్యుడు పలకరించకుండానే అనుకుంటూ మరో నాలుగడుగులు వేసింది.

దివిటీలు పట్టుకుని ఒకతను నడుస్తున్నాడు. అతని వెనకే డప్పుల వాళ్ళు. ఆ వెనకే పొడవాటి జుట్టు విరబూసుకుని ముగ్గురు వ్యక్తులు– చేతిలో కొరడా. మొహాన పెద్ద కుంకుమ బొట్టు, కాళ్ళకు పారాణి, గజ్జెలు, పసుపు,ఎరుపు, ఆకుపచ్చ, నీలం వంటి గాఢమైన రంగులతో ఉన్న లంగా కట్టుకొని విచిత్రమైన వేషధారణలో... డప్పుల కనుగుణంగా చిందులు వేస్తూ....

వారి వెనక ముగ్గురు ఆడవాళ్ళు, వాళ్ళతో పాటు పది పదకొండేళ్ళ పాప నాట్యం చేస్తూ డప్పుల మోతకు ఊగిపోతూ... ఆవేశంతో తూగిపోతూ.... వచ్చిన వారికి కుంకుమ

బొట్టు పెడుతూ....

ఉన్నట్లుండి డప్పుల మోత తీవ్రస్థాయికి చేరుకుంది. జుట్టు విరబోసుకున్న ముగ్గురిలో ఒకతనికి ఓవ్యక్తి మేకపిల్లను అందించాడు. మేకపిల్లను అందుకున్న అతను దానిని నోటితో చీల్చుతుంటే- కుళాయి నుండి నీరు వచ్చినట్లు రక్తం చిమ్ముతూంటే- జనం ఆనందంతో కేరింతలు కొడ్తున్నారు – ఆ దృశ్యం చూస్తున్న విద్యకి ఒళ్ళు గగుర్పొడిచింది. మనం ఎక్కడున్నాం? ఆటవిక యుగంలోనా–?

కంప్యూటర్ యుగంలో ఉన్నాం. హైటెక్ పాలన సాగిస్తున్నాం. శాస్త్ర, సాంకేతిక రంగాలలో ఎంతో అభివృద్ధి సాధించాం అని ఒకవైపు గొప్పలు చెప్పుకుంటున్నాం. కానీ భూస్వామ్య భావజాలం పుష్కలంగా ఉన్న ఈ తెలంగాణా పల్లెల్లో మాత్రం సాంఘిక జీవనంలో మార్పేమీ లేదనడానికి నిదర్శనం కాదా... ఈ ఆటవిక ప్రవృత్తిలోని జంతుబలి.. అన్న సందేహం కల్గింది. ఆ దృశ్యం చూస్తూంటే....

“ఎవరతను ఎందుకలా చేస్తున్నాడు” పక్కనే నిల్చుని ఆనందంతో కేరింతలు కొడ్తున్న వ్యక్తిని అడిగింది.

అతను విద్యకేసి పైకి కిందకి ఓ సంశయాత్మక చూపు చూసి, ప్రక్కనున్న అతన్ని తట్టి పిలిచి జంతుబలి ఇవ్వొద్దని సర్కారు ఖానూను ఉన్నదట. ఇస్తే కేసులు బనాయిస్తున్నరట. ఈమె సర్కారామెనో–? పోలీసామెనో...? అని చెవి కొరకడం విద్య దృష్టిని దాటి పోలేదు. అయినా, అదేమీ విననట్లే మళ్ళీ అడిగింది.

“ఇంతకీ మీరెవరు?” సూటిప్రశ్న అవతల్నించి.

చెప్పింది..“ఓ... మా పెద్దగౌడ్ బిడ్డదోస్తా... అయితే ఏం ఫరక్ పడదులే... పరేశాన్ ఏం లేదులే.” అని ఊపిరి పీల్చుకొని జరుగుతున్న తంతు చూస్తున్నారు. తనూ ఆ తంతు చూస్తూనే “ఎందుకిలా చేస్తున్నారు?” మళ్ళీ అడిగింది విద్య

“గిది మీ కెర్క లేదా–? ఇయ్యాల్ల ఊరపండగ గద! గందుకే గావు పడ్తున్నరు”

“గావు అంటే”?

“ గావు అంటే... పానంతోని ఉన్న మేకపిల్లను నోటితోటి చీల్చి గావుపట్టడం అగ్గో... గటు సూడుద్రి పోతరాజు గావు పడ్తున్నడు” అని పోతరాజు చేస్తున్న పనిని ఉత్కంఠతో, ఉత్సాహంగా చూస్తూనే మధ్యలో ఓ చూపు విద్యవైపు విసిరి “గిది మీకు ఎర్కలేదా?” ప్రశ్నించాడు మళ్ళీ.

గావు పట్టడం అయిపోయింది. మిన్నంటుతున్న డప్పులమోత, కేకలు, కేరింతల మధ్య అదే జోరుతో అంతా ఊరి ప్రధాన ద్వారం వద్దకు నడిచారు. అంతకు ముందే ఎరుకల వారు అక్కడ సజీవంగా ఉన్న పంది కూనను పాతిపెట్టారు.

ఊరి పశువులన్నింటిని దాని మీద నుండి నడిపించారు. నడిపించేటప్పుడు మంత్రించిన నీటిని ‘‘పులుగొలియూ’’ అంటూ నినాదాలు చేస్తూ పశువులపై చిలకరించుతున్నారు. ఇలా ఈ తంతు జరుగుతూంటే కొందరు స్త్రీలు శివమెత్తినట్లుగా నాట్యం చేస్తున్నారు. చూడబోతే వాళ్ళంతా బాగా తాగి ఒళ్ళు ఎరగకుండా ఉన్నట్లు

అన్పించింది విద్యకి.

ఓ ప్రక్క జంతువుల్ని దేవతలుగా పూజించే సంప్రదాయం ఉన్న మన దేశంలోనే-దేవతల్ని శాంతింపచేయడం కోసం జంతువుల్ని బలి ఇవ్వడం, అనాగరికంగా నోటితో చీల్చి చంపడమూ, సజీవంగా పాతిపెట్టడమూ... ఎంత వైరుధ్యం..ఇక అక్కడ ఉండలేక ఆలోచిస్తూనే వెనుదిరిగింది విద్య. ఇంత అనాగరికంగా జరిగే ఊరపండుగలని ప్రభుత్వం ఎలా అనుమతిస్తోంది? మత విశ్వాసాల్ని అడ్డుగా పెట్టుకుని సామాజికంగా వెనుకబడి ఉన్న వర్గాలని, ముఖ్యంగా దళితులని అణిచి ఉంచే ప్రయత్నంలో భాగమా...? వారు చైతన్యవంతులైతే తమ ఉనికికే భంగం వాటిల్లవచ్చున్న అభద్రతా భావమా...? ఎన్నెన్నో ఆలోచనలు సుడులు సుడులుగా తిరుగుతుండగా.....

ఏమీ జరుగనట్లుగానే, ఏమీ ఎరగనట్లుగానే అతి మామూలుగానే వెలుగు రేఖలు నెమ్మది నెమ్మదిగా ఆక్రమించుకుంటుండగా విద్య ఇంటికి చేరింది.

“ఏమయ్యావ్.. ఎక్కడికి వెళ్ళావ్ విద్యా, నీ కోసం నేనెంత కంగారు పడ్డానో తెల్సా?” కవిత ఆదుర్దాగా ప్రశ్నించింది.

“ఏంటి కవితా..., నేనేమైనా చిన్న పిల్లనా...?” మీదేమైనా మహాపట్నమా...? నేను తప్పిపోవడానికి? డప్పుల మోతకి మెలకువ వచ్చింది. ఆ మోతకి నిద్రపట్టడం లేదు. కోలాహలంగా మనుషుల అరుపులు... చప్పుళ్ళు.. ఏమిటో అర్థం కాలేదు. ఏమైందో... ఏమిటోనని అటువెళ్ళాను.”

“ఓహో... ఊరపండుగ చూసొచ్చావా...? “అని కవిత అంటూండగానే రాజాగౌడ్ అక్కడకి వచ్చాడు. ఆయన్ని చూడగానే విద్య తన సందేహాలు వెలిబుచ్చింది. “అంకుల్ ఊరపండుగ అంటే ఏమిటి..? ఎందుకు చేస్తారు? ఎలా చేస్తా?”

“చాలా కారణాలు ఉన్నాయమ్మా..గత పదిహేను ఇరవై రోజులుగా గ్రామంలో పశువులు అనారోగ్యానికి గురై చనిపోతున్నాయి. అందుకు కారణం గ్రామదేవత ఆగ్రహించడమేనని మా ఊరి ప్రజల నమ్మకం. కొన్ని చిల్లర పైసలు, కుంకుమ, పసుపు, బియ్యం చిన్న ముల్లె(మూట)గా కట్టి గ్రామ దేవత దగ్గర ఆ మూట ఉంచుతాం. దాన్నే మేం “ముడుపు” అంటాం.

ముడుపు వేసిన దగ్గర నుండి ఊళ్ళో ఎవరూ ‘నీచు’ ముట్టుకోకూడదు. హోటళ్ళలో నూనెతో ఏ తినుబండారాలూ చేయకూడదు. ఊరి వాళ్ళు ఎవరూ ఊరు దాటి పోకూడదు. వేరే ఊళ్ళలో ఉన్న ఈ ఊరివాళ్ళు రాకూడదు. “మరి మేం వచ్చాంగా” మధ్యలోనే అందుకుని సందేహం వెలిబుచ్చింది విద్య.

“అది ఆచారం. కానీ పట్నపు చదువులు వచ్చినంక అవి కొద్ది కొద్దిగా పక్కకు అవుతున్నయ్. అట్లనే ఇది” అని సర్ది చెప్పి మళ్ళీ ఇందాక చెప్తున్న దాన్ని తిరిగి ప్రారంభించాడు.

“ముడుపు కట్టిన వారం రోజులకు ఊరపండుగ గ్రామంలో చేస్తాం. ముడుపు కట్టిన నాటి నుండి పండగ అయ్యే వరకూ ఊళ్ళో ఎవరూ వాకిలి ఊడ్చరు. సాన్పు ఏయరు.”

“ చేస్తాం అంటున్నారు. మీరు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొంటారా”

సందేహంగా అడిగింది విద్య

కవితకి ఆ సంభాషణ నచ్చలేదేమో, నెమ్మదిగా ముందుకు కదిలి తను నాటిన సన్నజాజి మొక్క ఈ రోజు పెద్దదయి ఎన్ని పూలు పూసింది! అని అబ్బురంగా దాని వంకే చూస్తోంది.

రాజాగౌడ్ కూడా అడుగులేస్తూ "అవునమ్మా విద్యా... నేను కూడా పాల్గొన్నాను. ఊరపండుగ అంటే ఊరందరిదీ. ప్రతి కుటుంబం ఇంత అని చందాలు వేసుకునే పండుగ. బాపనయ్యలు, కోమటోల్లు మాత్రం ఈ పండుగల మాతోని కల్వరు. గ్రామ దేవతలకు ప్రీతి చేయడం కోసం, తృప్తి పరచడం కోసం ఈ పండుగ చేస్తం. దీన్నే పెద్దపండుగ అని కూడా అంటం."

రాజాగౌడ్ వెనకే చాలా ఆసక్తిగా వింటూ వచ్చిన విద్య ఆయన వరండాలోని పడక కుర్చీలో కూర్చోవడంతో తానూ ఆయన పక్కనే కుర్చీలో కూర్చోని "అంకుల్ గ్రామదేవతలు అంటే ఎవరు?" ప్రశ్నించింది. ఊరడమ్మ, పోశమ్మ, ఎల్లమ్మ, లక్ష్మమ్మ, గజ్జలమ్మ, మర్గమ్మ, పౌడాలమ్మా, ఈరమ్మా, సాగరమ్మా, ముత్యాలమ్మ, మర్గవ్వ, పోశమ్మ, ఎల్లమ్మ, మైసమ్మలు ఊళ్ళో ప్రజలకు వ్యాధులు రాకుండా అనర్థాలు కలగకుండా రక్షిస్తారు. పోత లింగయ్య వీరి సేవకుడు. పౌడాలమ్మా గ్రామ సరిహద్దులో కాపలా ఉండే దేవత. ఊరడవ్వ ఊరిని రక్షించే దేవత. ఎల్లమ్మ ఊర్లో కాపలా కాస్తుంటే పోశవ్వ ప్రేతాత్మలు ఆవరించకుండా బొందలగడ్డకు (స్మశానం) కాపలా కాసేదని కొందరు అంటూ ఉంటరు. నివాసాలు పాడై పోకుండా కాపాడేందుకు మైసమ్మ వచ్చింది. దొరల గడీలు కాపాడేందుకు సాగరమ్మ, గడీలలోని ఆడవారి రక్షణకు ఈరమ్మ, ఊరి సిరిసంపదలు కాపాడేందుకు లక్ష్మమ్మ వచ్చిందని పెద్దోళ్ళు చెప్పుతుంటరు.

"ఊరపండగ ఎపుడు చేస్తారంకుల్" శ్రద్ధగా విన్న విద్య మరో ప్రశ్న వేసింది.

"గ్రామాల్లో అంటువ్యాధులు వ్యాపించకుండా ఉండడం కోసం, కరువు, కాటకాలు రాకుండా ఉండడం కోసం, బర్కత్ కోసం ప్రతీ ఊర్లో ఊరపండుగ చేస్తాం. ఇది సాధారణంగా వర్షాకాలం ఆరంభంలో జరుపుతం." అని చెప్పి అప్పుడే వచ్చిన పేపర్ అందుకున్నారు రాజాగౌడ్.

పగలనకా, రాత్రనకా, ఎండనకా, వాననకా కష్టపడే మానవుడు ప్రకృతి పరంగా ఎదురయ్యే సమస్యల్ని ఎదుర్కోవడం తన వల్ల కాదనుకున్నాడేమో– ప్రతి సంఘటనకీ ఒక దేవతని ఏర్పరచుకున్నాడేమో.... కాపాడమని వేడుకుంటూ పూజలు, పండుగలు చేసుకుంటున్నాడేమో... లేదా ఈ పేరున తన పనికి తాను సెలవిచ్చేసుకుని, ఇన్నాళ్ళూ పడిన కష్టపు అలుపు తీర్చుకుంటూ తన కుటుంబ సభ్యులతోనూ– తన గ్రామ ప్రజలందరితోనూ ఆనందంగా గడపడానికి చేసుకున్న ఒక ఏర్పాటే ఈ పండుగలేమో....

ఎల్లమ్మ, పోశమ్మ, మైసమ్మ వంటి గ్రామదేవతలను పూజించడం ఉన్నత కులాలు అని చెప్పుకునే వారితో గ్రామీణులైన దళితుల్లోను, ఇతర వెనుకబడిన వర్గాల వారిలోనూ కన్పిస్తోందని మనసులో అనుకుని "అంకుల్ ఈ దేవతలకు రూపం ఇచ్చిందెవరు?" అడిగింది.

“వడ్రంగులు” పేపర్ చూస్తూనే జవాబిచ్చారాయన.

“గ్రామదేవతలంతా ఆడవాళ్ళేనా...? మగవాళ్ళు లేరా...? మీరు చెప్పిన దాంట్లో ఒక్క మగ పేరు కూడా లేదు.” అడిగింది.

“ఏమో నాకు తెల్సిన దగ్గర నుండి అవే పేర్లు విన్నాను. మగవాళ్ళవి వినలేదు. అయితే మాల, మాదిగ కులాల్లోని మగవాళ్ళు పూజారులుగా వ్యవహరిస్తారు. వీళ్ళనే పోతరాజులు అంటారు” రాజాగౌడ్ సమాధానం.

గ్రామదేవతలు మానవ నాగరికత తొలిరోజుల్నించి ఉండి వుంటారు. అన్నీ దేవతల పేర్లే ఉండడం అంటే... అది మాతృస్వామిక వ్యవస్థలోని చిహ్నాలు కావచ్చేమో...! ఆనాటి నుండి సాంప్రదాయికంగా వచ్చిన దేవతలేనేమో వీరు... అనుకుని “బ్రాహ్మలు, వైశ్యులు ఈ ఊరపండుగ చేయరని చెప్పారు కదా..? ఎందుకని..? ఊరిలో వారూ ఒక భాగమే కదా..? అంకుల్” “అవుననుకో.” అని తలగోక్కుంటూ “ఎందుకో మరి ఇది అట్లనే ఉంది నాకు తెల్సినప్పటి నుండి పోశవ్వ, ఎల్లవ్వ, మైసవ్వలకు బాపనోళ్ళు, కోమటోళ్ళు పూజ చెయ్యంగ నేను చూడలేదు. వారి దేవుళ్ళు వేరు. వారు విష్ణుమూర్తి, కృష్ణమూర్తి, లక్ష్మిదేవి, వెంకటేశ్వరుడు అట్లాంటి దేవుళ్ళకు కొలుస్తరు. మరందుకేనేమో... బాపనోళ్ళు, కోమటోళ్ళు తప్ప తక్కిన కులాల వాళ్ళంతా వతనుకొద్ది వాళ్ళ పనులు వాళ్ళు చేస్తరు.”

“అంటే..?” మధ్యలో అందుకుని ప్రశ్నించింది. విద్య అర్థం కాకపోవడంతో. చెట్టుపై తిరిగి చేరిన పక్షులను గమనిస్తూ అన్ని కులాల వాళ్ళని కచేరి కాడికి పిలిపిస్తడు పెద్దకాపు. పండుగ గురించి చర్చిస్తడు. అందరు కల్సి పండుగ తేదీ నిర్ణయిస్తరు. పండుగకు కావల్సిన డబ్బు ఏర్పాట్లు చేసుడు, బియ్యం తెచ్చుడు, పండుగ నిర్వహించే బాధ్యత పెద్దకాపుది. పండుగకు “యిటం” అందిస్తడు. పోతరాజులకు, మిగతా వారికి తాగడానికి కల్లు ఇస్తాడు.

నీరడి వాడు నాలుగు మానికలు జొన్నలు గట్క పట్టించి కచేరిలో పెట్టడు. కుమ్మరి ఇంటికి పోయి ఐదు కుండలు, ఐదు గురుగులు, ఐదు చిప్పలు, ఐదు కంచుడులు, పెద్ద తగారా తీసుక వచ్చి కచేరి కాడ పెట్టాడు. కావలసిన మామిడి ఆకులు, బొమ్మలు చెయ్యడానికి మామిడి కర్రలు బేగరి అతని సహాయంతో తెస్తడు.

నీరడోడు తెచ్చిన కర్రలతో వడ్రంగి ఆరోజంతా నిద్రలేకుంట, పని ఆపకుంట నిష్ఠతో గ్రామదేవతల ప్రతిమలు తయారు చేస్తడు. గైని వాడు పందిర్లకు అవసరమైన కట్టెలు తెస్తడు. బేగరోడు దేవతల ముంగిట పచ్చని పందిర్లు ఏస్తడు. మామిడాకులతో తోరణాలు కడ్తడు. ప్రతి విషయంలో పోతరాజుకు సాయంగా చేతికింద ఉంటూ, పోతరాజుకు పండగ పూర్తయ్యేవరకు తన ఇంటిలో ఆశ్రయం ఇస్తాడు. ఊరడమ్మ పండగలోనైతే చెత్త, పేగులు అన్నీ మోసి ఊరడి పోస్తడు. పోతరాజోడు గావు పడ్తడు. దూపర్తి ఏస్తడు. పట్లు వేస్తడు. సాక పోస్తడు. డప్పుల ముందు ఆడ్తడు. అది అతని బాధ్యత. తన దగ్గర ఉన్న తెల్లని కొత్త బట్ట దేవతల ముందు పరిచి కుంభం పోయడానికి చాకలి సాయం చేస్తడు. పోతరాజు గావు పట్టేటప్పుడు మేక పిల్లను అందిస్తాడు. పండగ రోజుల్లో రాత్రిపూట దివిటీలు పట్టుకుని తిరగాల్సిన బాధ్యత మంగలిది. కుమ్మరోడు కొత్త కుండలు, దీపంతులు, కంచాలు,

గొరుగులు తయారు చేస్తడు. మేత్రి అంటే మాదిగోల్ల కులపెద్ద. మేత్రోడే దున్నపోతు కోస్తడు. పోతును కట్టడానికి ఈత తాడు పేని, వేప మండలు తీసుకొస్తడు. తమ్మలోళ్ళు పూలదండలు ఇస్తరు. ఎరుకల వాళ్ళు ఊర్ల ఉన్న గైనిలకాడ పంది పిల్లను సజీవంగా పాతిపెడ్తరు. అవి పారిపోకుండా కావలి కాస్తరు. జోగోళ్ళు పండగ జరిగేప్పుడు ఆట ఆడతరు. పూజచేస్తరు. కొల్లామె రంగం ఎక్కి అన్ని విషయాలు, గ్రామ మంచిచెడ్డలు గ్రామస్థులకు తెలియచేస్తది.

గ్రామ పెద్దలు పటేళ్ళు పెద్దరికంగా నిలబడి ఊరపండగ మంచిగ జరిగేటట్టు చూస్తరు.” అని తన మొఖంలోకి చూస్తూ శ్రద్ధగా వింటున్న విద్యకేసి చూసాడు రాజాగౌడ్.

“అంకుల్ మీరు చెప్పింది విన్న తర్వాత నాలో మరికొన్ని కొత్త సందేహాలు తలెత్తాయి. మరి మీరు ఏమనుకోనంటే, మీరు చెప్తానంటే అడుగుతాను” అంది విద్య. తాను పట్నంలో పుట్టి పట్నంలో పెరిగిన విద్య పెద్ద చదువులు చదివిన విద్య ఏమాత్రం గర్వం లేకుండా ఎంతో వినయంగా ఉంది. తన పెద్దరికాన్ని గుర్తించి ఎంతో మర్యాదగా అడుగుతుంది అనుకున్న రాజాగౌడ్‌కి విద్యని చూస్తే ముచ్చటేసింది. నిజానికి తనకి పని వున్నా కూడా “ఫర్వాలేదు అడుగమ్మా నాకు తెలిసినంత వరకు చెప్తాను” అన్నాడు.

చాకలి, మంగలి, వడ్రంగి, కాపు, గౌడ్, ఎరుకల, మాదిగ, వంటి కులాల పేర్లు విని వున్నాను. కాని పోతరాజు, నీరడి, మేత్రి, బేగరి, కామ్‌దార్, గైని, జోగిని, కొల్ల వంటివి నేను ఎప్పుడూ విన్లేదు. బహుశా పల్లెల్లోనే వీరు వుంటారేమో తెలియదు. లేక తెలంగాణా పల్లెల్లోనే వున్నారో తెలియడం లేదు.

ఇవన్నీ మాల, మాదిగ కులాల్లో వారి ఇంటి పేర్లే. అవి వారు చేసే పనిని బట్టి వచ్చాయి.

“అంటే...?”

“ నీరడి వాళ్ళు పంట పొలాలకు కాలువల నీళ్ళు సరిగ్గా అందుతున్నాయో లేదో చూస్తరు. బేగరోళ్ళు ఊర్లో ఎవరైనా చనిపోతే బొంద తవ్వుతరు. గైనోడు ఊరికి కాపలా కాస్తాడు.”

సాంప్రదాయక భారతసమాజంలో చతుర్వర్ణ సిద్ధాంతం స్థూలంగా శ్రమవిభజన నిర్వచించింది. కులాన్ని బట్టి శ్రమవిభజన, పని కేటాయింపు అనేది కుల వ్యవస్థలోని ఒక అంశం. నిచ్చెనమెట్ల కులవ్యవస్థలో అంటరానివారుగా, చండాలురుగా భావించే దళితులకు సమాజం, ప్రజలు హేయంగా భావించే వృత్తులు, పనులు కేటాయించారు. పాకీదొడ్లు శుభ్రం చేయడం, జంతువుల కళేబరాలు తీయడం, వాటి చర్మం ఒలిచి చెప్పులు కుట్టడం, ఊరికి వెట్టి చాకిరీ చేసే కట్టు బానిసత్వం ఒక తరం నుండి మరో తరానికి వారసత్వంగా సంక్రమిస్తోంది. ఆక్రమంలోనే వీరు తమ కోసం, తమ కుటుంబ అభివృద్ధి కోసం కాకుండా ఊరిలోని ఉన్నత వర్గాల కోసం, అగ్ర కులాల కోసం, ధనవంతుల కోసం వారి ఆధిపత్యంలో అజమాయిషీలో పనిచేస్తున్నారనుకుంది విద్య. అయితే, అందులో వారికి సంతోషం ఉందా? అది ఆచారం కాబట్టి అమలు జరుగుతోందనీ, ఆనవాయితీ కాబట్టి అలా జరగాలని

అనుకుంటున్నారా? వారితో ఊరంతా ఊడిగం చేయించుకుంటుంటే, వెట్టి చేయించుకుంటూ ఉంటే ఆ భావన వారిలో కలగదా? బాధ ఉండదా? ఇది విధిరాత ఎవరూ చెరపలేనిది. మార్చలేనిది అని సరిపెట్టుకుంటున్నారా? అని ఆమెలో ఎన్నెన్నో సందేహాలు మదిలో చేరి కలవర పరుస్తుండగా,

" అంకుల్ చాలా విషయాలు చెప్పారు. మీరేమీ అనుకోనంటే మరో చిన్న ప్రశ్న."

" ఊ... అడుగమ్మా..."

" జోగిని అంటే ఏమిటి? ఆ పదం ఎప్పుడో ఎక్కడో విన్నట్లు ఉంది కానీ గుర్తురావడం లేదు."

అప్పటి వరకూ ఎంతో ఉత్సాహంగా చెప్పుకొచ్చిన రాజాగౌడ్‌కి ఈ ప్రశ్న ఇబ్బందిగా అన్పించింది. మొహం ఎలాగో పెట్టుకుని,

" హాయిగా పట్నంలో చదువుకునే నీకు ఈ పల్లె ఆచారాలు, అలవాట్లు ఎందుకులే... ఏదో చదువూ సంస్కారం లేని మోటు బతుకులు మావి" అన్నారు, కుర్చీలోంచి లేస్తూ....

" అదేటంకుల్ అలా అంటారు పల్లెలే కదా మన దేశానికి పట్టుకొమ్మలు... కాకపోతే ఇక్కడ ప్రజల ఆచారాలు, సంప్రదాయాలు పట్టణ నాగరికతకి కొంత భిన్నంగా ఉండవచ్చు. అయితే విభిన్న సంస్కృతులకూ, భాషలకూ, ప్రాంతాలకూ, కులాలకూ ఆలవాలమైన మన దేశంలో ఇది సహజమే కదా... మన సంస్కృతి, సంప్రదాయాల గురించి కొత్త విషయాలు తెల్సుకోవడమంటే నాకెంతో ఇష్టం. అందుకే మిమ్మల్ని అడిగాను. చెప్పండి అంకుల్ –" విద్య అంటుండగా

"ముచ్చట్లు అటెనుక ముందు లేచి మొహం కడుక్కొని, నాస్తా చేద్దురు" అంటూ కేకవేసింది కవిత వాళ్ళ అమ్మ రాంబాయి.

కవిత, విద్య ప్రాణస్నేహితులు.

విద్య పుట్టి పెరిగింది విజయవాడలో. కవిత పుట్టింది నిజామాబాద్ జిల్లా ఎల్లారెడ్డికి దగ్గరలోని లింగంపేటలో. పెరిగింది సిరిపురం అనే పల్లెలో

పదవ తరగతి వరకు ఎల్లారెడ్డిలో చదివింది. ఫస్టుక్లాసులో పాసయింది. పదవ తరగతి అవగానే ఆమెతల్లి పెళ్ళి చేసేయ్యాలని చాలా గొడవ చేసింది. కానీ కవిత ఒప్పుకోలేదు. చదువుకుంటానని పట్టుపట్టింది. ఇంట్లో ఉండి ఏం చేస్తుందిలే, ఏదో ఒక సంబంధం కుదిరేవరకూ అని కాలేజీకి పంపడానికి ఒప్పుకున్నారు. ఎల్లారెడ్డి ప్రభుత్వ జూనియర్ కాలేజీలో అయితే మగపిల్లలు ఉంటారు. మగపిల్లల్తో కలిసి చదివితే ఎక్కడ, ఎవరితో ప్రేమలో పడతుందో... తమ కుటుంబ మర్యాదలకి ఎక్కడ భంగం ఏర్పడుతుందోనని హైదరాబాద్‌లోని ఒక ప్రైవేట్ కాలేజీలో చేర్పించి హాస్టల్‌లో పెట్టారు.

అసలెప్పుడూ బాగా చదివే కవితకు మంచి కాలేజీ, మంచి లెక్చరర్లు, మంచి బోధన తోడవడం, వేరే వ్యాపకాలు ఏమీలేకపోవడంతో తన దృష్టి అంతా చదువు పైనే

పెట్టింది. అనుకోని విధంగా ఇంటర్‌లో స్టేట్ తొమ్మిదవ ర్యాంక్ వచ్చింది. మేనల్లుడు అమెరికా వెళ్ళే ప్రయత్నంలో ఉన్నాడు. అమ్మాయిని కూడా బాగా చదివిస్తేనే అతను చేసుకుంటాడు. లేకపోతే కాదనవచ్చు. మేనల్లుడి సలహా కోరాడు రాజాగౌడ్. బిట్స్ పిలానీలో సీటు రావడం కష్టం. మన కవితకి వచ్చింది కాబట్టి అక్కడ చేర్చమనీ, చదువు మాన్పించవద్దనీ సలహా ఇచ్చాడు మేనల్లుడు.

ఆడ మగ కలిసి చదువుతారని బిట్స్ పిలానీలో కాకుండా హైదరాబాద్‌లోనే బి.యస్సీ కంప్యూటర్స్‌లో జాయిన్ చేయడానికి ఒప్పుకున్నాడు రాజాగౌడ్.

బియస్సీ పూర్తి చేసిన కవితని యం.సి.ఎ. ఉస్మానియాలో కాకుండా తిరుపతిలోని శ్రీ పద్మావతి విశ్వవిద్యాలయంలో చేర్పించాడు. ఆడపిల్లల కాలేజీ అయితే భద్రతగా ఫీలయినందువల్ల. మొత్తానికి పై చదువుకు అంగీకరించడమే తనక్కావల్సింది. అది ఏ కాలేజీ అని కాదు అనుకొన్న కవిత అలా తిరుపతిలో అడుగుపెట్టింది. అక్కడే కవిత, విద్యల పరిచయం ఆరంభమైంది రూమ్మేట్స్‌గా. ఈ ఇద్దరి పరిచయం ఆ తర్వాత స్నేహ కుసుమాల్ని విరబూయించింది. గుబాళించింది.

విద్య అమ్మానాన్నలు ఇద్దరూ స్కూల్ టీచర్స్. పనిచేసేది విజయవాడ పట్టణంలోనే..

విద్య ఉమెన్ డెవలప్‌మెంట్ స్టడీస్‌లో ఎం.ఎ. పరీక్షలు రాసింది. ప్రాంతాలు వేరైనా, చదివే కోర్సులు వేరైనా ఇద్దరూ రూంమేట్స్ కావడం వల్లనేమో చక్కని స్నేహం కుదిరింది. ప్రతి విషయాన్ని తరచి చూస్తూ మంచి చెడులను విశ్లేషిస్తూ, బేరీజు వేసే విద్య అంటే కవితకి ఇష్టం. గ్రామంలో ఆస్తిపాస్తులు మెండుగా ఉన్నా సాదాసీదాగా ఉంటూ పట్టుదలగా చదువుతూ క్లాస్ ఫస్టుగా నిలిచే కవిత అంటే విద్యకి వల్లమాలిన అభిమానం. విద్య ఎం.ఎ. పరీక్షలు అయిపోయాయి. కవిత మరో సంవత్సరం చదవాలి. ఎం.సి.ఎ. పూర్తికావాలంటే... భవిష్యత్తులో ఎవరు ఎక్కడ... ఎపుడు... ఎలా కలుస్తామో...! ఇప్పటిలాగా కలవడానికి రుచులు, అభిరుచులూ పంచుకోవడానికి వీలువుతుందో లేదో... అంటూ కవిత విద్యని తమ ఊరు రమ్మని గొడవ చేసింది. తిరుపతి నుండి వస్తూ దారిలో విజయవాడలో ఆగి విద్యావాళ్ళింటి దగ్గర నాలుగు రోజులు గడిపి సిరిపురం వచ్చారు. కవిత సిరిపురంలోనే పెరిగినా... జోగినీ అంటే ఏమిటో తెలియదు. "జోగిని" అనే పదం మాత్రం విని ఉంది. కానీ ఆ విషయాలు తెల్సుకోవాలన్న ఆసక్తి ఆమెకెప్పుడూ కలుగలేదు. తన చదువు ధ్యాస తప్ప. ఇపుడు సడన్‌గా విద్య అడిగే సరికి ఏం చెప్పాలో తెలియలేదు.

రాత్రి భోజనాల సమయంలో విద్య మళ్ళీ అడిగింది రాజాగౌడ్‌ని. ఆయన చెప్పకుండా దాటవేశారు. ఊరపండుగ గురించి అంత చక్కగా చెప్పిన ఆయన జోగిని గురించి చెప్పడానికి ఇష్టపడడం లేదని గ్రహించింది విద్య. అయితే కారణం ఆమె ఊహకి అందడం లేదు.

"నాన్నా విద్య ఉమెన్ స్టడీస్ స్టూడెంట్ అని తెల్సుకదా....! అందుకే తాను జోగినుల గురించి తెల్సుకోవాలనుకుంటుందనుకుంటా... చెప్పు నాన్నా... ఇప్పుడు నీవు చెప్పక పోయినా రేపు తానే జోగిని దగ్గరకు వెళ్ళయినా తెల్సుకుంటుంది. అంత ఆసక్తి తనకి." అంది కవిత.

"జోగిని అంటే దేవత భార్య. నిత్య సుమంగళి" అని టూకీగా చెప్పి అక్కడ నుండి వెళ్ళిపోయాడు రాజాగౌడ్.

"జోగిని" స్త్రీ కదా! ఆమెను దేవతకిచ్చి పెళ్ళి చేయడం ఏమిటి అసహజంగానూ.... అన్యాయంగానూ ఉందే... ఆ రోజుల్లో కూడా స్వలింగ సంపర్కం ఉండేదా...? అందుకు చిహ్నమే దేవతతో ఆడపిల్లకి పెళ్ళి...? మనస్సులో మెదిలిన భావనలు అప్రయత్నంగా విద్య నోటి నుండి.

" అది ఒక ఆచారం, మాలమాదిగల్లో, ఎనకటికెళ్ళి నడుస్తున్నది. " సమాధానంగా అంది రాంబాయి.

విజయవాడలో గాని, అక్కడి దగ్గర పల్లెటూళ్ళలో కానీ తానెప్పుడూ జోగిని గురించి వినలేదు. మహిళల గురించి చదువుతున్న తాను ఎక్కడా, ఎపుడూ చదవలేదు. ఆ పదం మాత్రం ఎక్కడో ఎప్పుడో విన్నట్టు గుర్తు.

అసలు ఒక అమ్మాయిని జోగినిగా ఎందుకు చేస్తారో? ఎవరు చేస్తారో? ఎలా చేస్తారో? అసలు ఈ ఆచారం ఎలా పుట్టిందో? ఎందుకోసం, ఎవరికోసం ఏర్పడిందో? జోగినిలు ఈ ఊర్లోనేనా ఇంకా ఎక్కడైనా ఉన్నారా? ఉంటే ఎంత మంది ఉంటారో? అసలు ఇది ఒక ఆచారమా? దురాచారమా! జోగిని గురించి ప్రభుత్వానికి తెలుసా? తెలిస్తే ప్రభుత్వ స్పందన ఏమిటి? జోగిని అయిన స్త్రీ తాను జోగినిగా ఎలా ఫీలవుతుంది? జోగిని మాల మాదిగల్లోనే ఎందుకు? వేరే కులాల్లో ఎందుకు లేరు? ఇలా ఎన్నెన్నో ప్రశ్నలు విద్య మస్తిష్కంలో. వీటికి సమాధానం ఎక్కడ దొరుకుతుంది? ఎవరిస్తారు? ఆలోచనల్లోనే ఆ రోజు గడచి పోయింది. సడన్‌గా కవిత అన్న మాటలు గుర్తొచ్చి కరెక్ట్ అలా చేయాలి అని నిశ్చయించుకుని నిద్రకుపక్రమించింది. ఉదయం టిఫిన్ చేస్తూ తన నిర్ణయం చెప్పింది. అంతా ఒక్క సారిగా ఉలిక్కి పడ్డారు. ఆశ్చర్యపోయారు. నివ్వెరపోయారు.

"ఆ.... అలగా జనం దగ్గరకు పోతావా? వద్దు. అట్లా పోతే మన పరువు ఏం కాను. వద్దు." ఇది నా ఆజ్ఞ అన్నట్లుగా కంఠం ధ్వనిస్తుండగా మరో మాటకు అవకాశం ఇవ్వకుండా కండువా తీసుకుని గబగబ బయటకు నడిచాడు రాజాగౌడ్.

"మనసొంటి వాళ్ళు అటు దిక్కుపోరు. ఆళ్ళు ఇటు దిక్కు రావద్దు! ఊర్లో కొన్ని పద్ధతులు, ఆచారాలు ఎనకటికెళ్ళి అట్లనే నడుస్తున్నాయి. వాటిని మనం గౌరవించాలి. అట్లనే నడవాలె. మాలమాదిగల ఇండ్ల దిక్కు పోతే మైలపడతం." రాంబాయి నచ్చజెప్ప చూస్తుంది.

అయినా విద్య వినిపించుకోలేదు. తను వాళ్ళను కలిసి తీరాల్సిందే అంది. కవిత "సారీ" చెప్పింది – రాలేనందుకు. తన కోసం అంత దూరం నుండి వచ్చిన మిత్రురాలి కోరిక మన్నించలేకపోతున్నందుకు బాధపడింది. కానీ యస్.సి. కాలనీలో అడుగు పెట్టే సాహసం మాత్రం చేయలేక పోయింది. కవితను ఏమీ బాధపడవద్దని ఊరడించి నేను వెళ్ళి వస్తానంటూ బయలుదేరబోతుండగా...

"అయితే ఆ జోగోళ్ళనే కొట్టం కాడికి పిలిపిద్దాం సుంకరోనితోని" అంది

రాంబాయి. మళ్ళీ ఆమె " రానీ, ఈడికి ఆళ్ళు పోయినంక నీళ్ళు చల్లుకుందాం." అంది.

ఇక్కడికి పిలిపించడం కంటే తానే అక్కడికి వెళ్ళి తెలుసుకోవడం మర్యాద అనుకున్న విద్య తాను వెళ్ళి తీరాల్సిందేనంది. ఇక లాభం లేదనుకున్న రాంబాయి సుంకరి సాయిలును పిలిచి.

"విద్యమ్మ, జోగోళ్ళతోని మాట్లాడల్నట. ఆడిదాంక తోలుకపో." అని అతన్ని పంపడంతో విద్యకు పని సుళువయింది. అతను అటు కదలగానే అతను నడిచిన స్థలంలో పసుపు నీళ్ళు చల్లడం ఎందుకో అర్థం కాలేదు విద్యకి.

తలకి పాగా, చేతిలో పొన్నుకర్ర, ముతక పంచె, ముక్కలు అతికించి కుట్టినట్టున్న చేతుల గుడ్డ, బనీను, నల్లగా... దృఢంగా, నమ్మకంగా కనిపించే సాయిలు చెప్పులు లేని కాళ్ళతో గబగబ అడుగులేస్తూ... అతనితో పాటే నడవడానికి ప్రయత్నిస్తూ విద్య.

ఆ ఊర్లో కొత్తగా కనిపిస్తుందనో, లేక మోడ్రన్ డ్రస్‌లో ఒక పని వాడివెంట నడిచి వచ్చే ఆ యువతి ఎవరా అనో, దళిత వాడకు రావడం ఏమిటా అనో, ఎవరింటికి వస్తుందన్న ఉత్సుకతతోనో కానీ దారిలో వచ్చే వాళ్ళు, పోయేవాళ్ళు, ఇళ్ళ ముందు నిలిచి చూసేవాళ్ళు, లోపలి నుంచి బయటకు తొంగి చూసే వాళ్ళు, అంతా ఆమెనే చూస్తూ... కొందరికి వింతగానూ, మరికొందరికి ఆశ్చర్యంగానూ, ఇంకొందరికి అపురూపంగానూ ఉంది ఆ దృశ్యం. తమ జీవితంలో ఎపుడూ ఊహించని, కనీసం కలలోనైనా తలవలేని విధంగా ఉందా దృశ్యం. అంత అద్భుతంగా తోచింది కొందరికి.

"సాయిలు" అతని వేగాన్ని తగ్గిస్తూ విద్య పిలుపు.

" ఏం దొరసా...."

" మీ ఊరి గురించి చెప్పకుండా అంత వేగంగా నడుస్తున్నావు. నీ అంత వేగంగా నడవలేకపోతున్నా"

కొద్దిగా ఆయాసపడ్తూ విద్య.

"తప్పయింది దొరసాని" వినయపూర్వకంగా సాయిలు.

"దొరసాని.... అనొద్దన్నానా" విద్య మందలింపు.

"తప్పయింది, దొర – " మధ్యలోనే ఆగిపోయి.

" గిటు ఎడం చేతి దిక్కున్నది బి.సి. కాలనీ. ఆ వాడల కాపోల్లు, కుర్మోల్లు, బేస్తోల్లు, కుమ్మరోల్లు, కమ్మరోల్లు, వడ్లోల్లు, సాలోల్లు, తెనగోల్లు, పెరకోల్లు, గాండ్లోల్లు, చాకలోల్లు, మంగలోల్లు, తురకోల్లు ఉంటారు. ఈళ్ళకు అసలిండ్లు ఊర్లనే ఉండె. కుటుంబాలు పెరగబట్టే. తండ్రులు, కొడుకులు, ఆళ్ళ కొడుకులు ఏరబడతాంటే ఇళ్ళు చాలక పాయే. గప్పుడు ప్రెతాపరెడ్డి దొర ఉన్నప్పటి ముచ్చట. గా దొరనే సర్కారు జాగ ఇప్పించ్చిండట. ఆ జాగలనే కొందరికి సొంత ఇండ్లు లేపుకున్నరు. కూనో, పెంకో, పరకో ఏసుకొని కొందరికి సర్కారిండ్లు మంజూరి తెచ్చుకొని లేపుకున్నరు." అంటూ ఊరికి ఆనుకుని ఎడమ చేతివైపు ఉన్న కాలనీ గురించి చెప్పాడు నడక వేగం తగ్గించిన సాయిలు.

ఆ కాలనీకి కుడివైపున ఖాళీగా వున్న పొలాలు అక్కడక్కడా పశువులు మేత

మేస్తూ...

అక్కడక్కడా పొలం గట్ల మీద బొబ్బిలి చెట్లు...

రోడ్డుకు దగ్గరలో ఒక మడిలో పెరిగిన విప్పచెట్ల జంట.

వాటికింద ఆ నీడలో చేరిన పశువులు కాసే పిల్లలు. కర్రా బిళ్ళ ఆడుతూ కేకలు. అరుపులు.

స్కూటర్ పైనో, మోటర్ సైకిల్ పైనో అటొక కాలు, ఇటొక కాలు వేసి కూర్చొన్నట్లుగా దున్నపోతు పై దర్జాగా కూర్చుని పొలంలో తిరుగుతున్న పన్నెండేళ్ళ కుర్రాడు.

అది గేదో, దున్నపోతో తెలియడం లేదు కానీ బక్కచిక్కిన దాని మీద సర్కస్ ఫీట్లు చేస్తూ అదే వయస్సులోని మరో పిల్లాడు.

ఆ గేదెల మీద - కొమ్ముల మీద వాలిన కాకులు, కొంగలు ... మేమేం తక్కువా అంటూ.. మధ్య మధ్యలో లేచి ఎగురుతూ...

ఎండిపోయి ఇప్పుడిప్పుడే పచ్చబడ్తూన్న కోసేసిన వరికుదుళ్ళ మధ్యలో అక్కడక్కడా కొంగలూ... చాలా గమ్మత్తుగా ఉందా దృశ్యం.

" సాయిలూ, ఈ పిల్లలంతా బడికి వెళ్ళరా...? చెట్లకింద ఆటలాడుతున్నారు"

" ఈల్లంత బర్లుగాసే పోరగాల్లు, ఈల్లకు జీతం బెట్టిన్రు. జీతం పోకుంట బద్లెకుపోతే కాపోల్లు ఊకుంటరా...! ఆల్ల అయ్యవ్వలు తీసుకున్న పైస పోయమంటరు. యాడికెల్లి తెత్తరు..? ఆల్లు బడికి పోకుంట జీతం చేత్తరు. పశులతోని అచ్చి ఈడనే అడ్కుంటరు" అని చెప్పి

"గదే, గాడికే మనం బోయేడిది... మాలోల్ల, జోగోల్ల ఇండ్లు... అంటూ కిలోమీటరు దూరంలో కుడివైపు దిగువగా ఉన్న ఇళ్ళను చూపాడు.

సమాజంలోని సామాజిక వివక్షకు సాక్ష్యమా...? ఆ ఇళ్ళు నునుకొంది విద్య మనసులో, కాలనీలోకి అడుగు పెట్టకముందే కల్లుపాక- పెట్టెల్లో సీసాలు - ఉదయం కూడా అక్కడ ఆడ... మగా...

ఊర్లో తాగడానికి నీళ్ళు లేకపోయినా కల్లు సారాలకు కొదువ ఉండదేమో... మనసులో

ఆ పాక ముందే బజ్జీలు, గారెలు, పునుగులు, చీకులు... ఉన్న గంపలతో ఇద్దరు ఆడవాళ్ళూ....

కల్లు సీసాలు తీసికెళ్తూ పిల్లలూ... పెద్దలూ... అలా చుట్టూ పరికిస్తూ నడుస్తూన్న విద్య ఆశ్చర్యంతో చూస్తూ అలా ఆగిపోయింది.

సీసా తీసికెళ్తున్న ఓ 9 ఏళ్ళ బాబు ఆ సీసా ఎత్తి కొంత గొంతులో పోసుకుని ముందుకు కదిలాడు. అలా నాలుగడుగులు వేసిందో లేదో ఓ ఇంటి ముందు ఆ యింటి స్త్రీ కావచ్చు ఏడాది పసిపాపకు కల్లు తాగిస్తోంది. ఆ దృశ్యం చూసిన విద్య విస్తుపోయింది. అది గమనించిన సాయిలు అది ఇక్కడ మామూలేనని చెప్పాడు. ఆ యింటి ఇల్లాలు పనిలోకి వెళ్ళాలంటే పిల్లను చూడ్డానికి ఎవరూ లేకపోతే ఆ చంటి పిల్లకు ఒకటో రెండో గ్లాసులు

కల్లు తాగిస్తారనీ, అప్పుడు ఆ పిల్లలు కదలకుండా మెదలకుండా పడుకుంటారనీ సాయిలు చెప్పిన మాటలు విన్న విద్య నోటమాట రాలేదు.

ఆ కాలనీలో అవి మాలల ఇళ్ళు. ఇవి మాదిగల ఇళ్ళు అంటూ చూపాడు సాయిలు. కాలనీలో రెండొంతులు పాకలు, ఒక వంతు కూన పెంకుటిళ్ళు అవీ పాతకాలంలోనవిలా ఉన్నాయి. వాటిని ఇందిరా గాంధీ హయాంలో కట్టుకున్నారట. రెండిళ్ళు మాత్రం పెద్దవి. పాతవి మండవా ఇళ్ళలా కన్పిస్తున్నాయి. పది పన్నెండు ఇళ్ళు ఈ మధ్యే కట్టినట్టు కొత్తగా బెంగుళూరు పెంకులతో ఉన్నాయి. ఒక గదిలో చిన్న చిన్నవిగా... చాలా ఇళ్ళు.... డ్రైనేజీ ఉందన్నట్లు ఆనవాళ్ళుగా నిండిపోయి, పూడిపోయి... రోడ్డు పక్కల పచ్చగడ్డితో రోడ్డుకిరువైపులా మల మూలమూత్రాదులతో...

నాలుగిళ్ళు దాటగానే.. మినీ వాటర్ టాంకు

అక్కడే అమ్మలక్కలు ఇత్తడి బిందెలు ఆ బురద మట్టితోనే తళతళ తోముతూ... మెరిపిస్తూ మట్టి కుండల్లో నీళ్ళు పడుతూ... అంట్ల గిన్నెలు తోముతూ... బట్టలు ఉతుకుతూ... అదే సబ్బుతో పిల్లలకు స్నానాలు చేపిస్తూ... తలలు రుద్దుతూ, పశువులకు నీళ్ళు తాగిస్తూ...

అక్కడే నిలిచిన నీళ్ళూ.... ఈగలూ... దోమలూ...

అంతా అచేతనులైనట్లు అక్కడ గాలి స్తంభించినట్లు తమ తమ పనులు ఆపి విద్యకేసే వింతగా చూస్తూ, పరిశీలనగా చూస్తూ ఆ తర్వాత కొద్ది సేపటికి ఏదో చైతన్యం తమలో ప్రవేశించినట్లు...

నీళ్ళ ట్యాంక్ దాటిన తర్వాత వచ్చిన మూడో ఇంటి ముందు ఆగి.

"ఓ పోశీ... జోగు పోశీ...." కేకలేశాడు సాయిలు.

చామనచాయ, మామూలు ఎత్తు, లావు కాకుండా సన్నం కాకుండా ఉన్న ఆమె నుదుట రూపాయి బిళ్ళంత మిరపపండు ఎరుపులో కొట్టొచ్చినట్టు కనిపించే కుంకుమ బొట్టు, నూనె బాగా పెట్టి నున్నగా దువ్వి కొప్పుపెట్టిన జుట్టు, ఆ కొప్పులో నుంచి చివర్లు కుడివైపు తొంగిచూస్తూ, వారిలో అణిచేసిన ఆశల్ని, కోరికల్ని చుట్ట చుట్టినట్లు అందులోంచి బయటపడాలనీ, ఆ బంధనాల చుట్టునుండి విముక్తి కావాలనీ ఎదురుచూస్తున్నట్లుగా...

చెవి చుట్టూ పోగులు పెట్టి తీసేసినట్లు ఆనవాళ్ళుగా రంధ్రాలు... మెడలో నల్లటి తాడుకు తోలుముక్క...

నలిగిపోయి... చిరిగిన కొట్టొచ్చినట్టు కన్పించే ఫ్లోరోసెంట్ ఎల్లో కలర్ పాలిస్టర్ చీర... గోచికట్టులో... ఆపై ఆకుపచ్చ రంగు రవిక... జర్దాపాను నములుతూ అదో రకమైన చూపు.

ఆ కంటి లోతుల్లో... ఎన్నెన్నో అగాధాలు ఉన్నట్లూ వేటికోసమో వెదుకుతున్నట్లూ

అరవై ఏళ్ళు ఉంటాయేమో ఓ స్త్రీ బయటకు వచ్చింది.

"ఎవరూ" అంటూ....

సాయిలు వెనకే ఉన్న విద్యని చూసి ఒక్కడుగు వెనక్కి వేసి.

"ఓరి సాయిగా... ఎవరీ దొరసాని" లోగొంతుకతో అడిగిందామె. మళ్ళీ ఒక్కడుగు

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Jogini**

* * *